క్లుప్తంగా

రీసర్వేపై అవగాహన

పాణ్యం: మండలంలోని బలపనూరు గ్రామంలో త్వరలో ప్రారంభం కానున్న రీ సర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు రీ సర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కొలతల సమయంలో పొరుగు రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. భూమి కొలతల్లో తేడాలు ఉంటే వాటిని సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రీ సర్వే కోసం ప్రత్యేక సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, గ్రామకంఠాలు, అసైండెడ్ భూములన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి కొలతలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజు, డీటీ శివ శంకర్‌రెడ్డి, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

జాలీగా వాలీబాల్



సూదిరెడ్డిపల్లెలో వాలీబాల్ ఆడుతున్న యువత

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని సూదిరెడ్డిపల్లె శివాలయం సమీపాన యువత వాలీబాల్ ఆడుతూ జాలీగా గడుపుతున్నారు. ఆహ్లాదకరమైన వాతవరణంలో గ్రామానికి చెందిన ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు దాదాపు 50 – 60 మంది వివిధ జట్లుగా ఎర్పడి రోజూ ఉదయం, సాయంత్రం వాలీబాల్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు. ఆటలో రెండు జట్లు తలపడుతుండగా మిగతా వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ప్రస్తుతం దసరా సెలవుల నేపథ్యం, వాతావారణం చల్లగా ఉండటంతో ఎక్కువ సమయం క్రీడల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. క్రీడల ద్వారా ఆరోగ్యం కాపాడుకోవడమే గాకుండా స్నేహ బంధాలు బలపడుతున్నాయని వారు చెబుతున్నారు. మొబైల్‌లో గడిపే సమయాన్ని క్రీడలకు కేటాయించడం వల్ల మనస్సుకు సంతోషం, శరీరానికి చలాకీతనం వస్తోందని యువకులు తెలిపారు.

నివాళి



తిమ్మయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని

పాణ్యం: బలపనూరు గ్రామానికి చెందిన విశ్రాంత పీఆర్ ఇన్‌స్పెక్టర్ కె. తిమ్మయ్య (67) సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన తిమ్మయ్య భౌతికకాయానికి సోమవారం నివాళులర్పించారు. విధుల్లో ఉన్న సమయంలో తిమ్మయ్య ప్రజల మన్ననలు పొందారని, భార్య సర్పంచ్‌గా ఉన్న సమయంలో కూడా గ్రామానికి సేవలందించారని తెలిపారు. ప్రజల్లో ఉండి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మానసిక ప్రశాంతత కలిగించేలా చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ఆదిశేషారెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామిరెడ్డి, పుల్లయ్య, రామలక్ష్మయ్య ఉన్నారు. కాగా మృతుడికి భార్య వెంటకలక్ష్మమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసింది!

- అధిక వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలి
- కర్నూలు మార్కెట్ యార్డులో కమీషన్ల దందాను అరికట్టాలి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి





నడివాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించేందుకు ఎడ్ల బండిపై వెళ్తున్న కాటసాని, అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం రైతులను రోడ్డున పడేసిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. హుసేనాపురం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, పొగాకు పంటలను సోమవారం ఆయన రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా చేదు శ్రీనివాసులు, గాలెన్న అను రైతులు సాగు చేసిన పత్తి పొలాల్లో నిల్వవున్న వర్షపునీటితో పంట దెబ్బతిన్న పరిస్థితులను గమనించారు. అనంతరం నడివాగు వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎద్దులబండిపై వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతుల సమక్షంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయన్నారు. పంటలు కోతదశకు వచ్చే సమయంలో అధిక వర్షాలు కురవడం, పండించిన దిగుబడులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా వుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లి దిగుబడులను అమ్మకోవడానికి మార్కెట్‌కు తీసుకెళ్లిన రైతుల నుంచి కమీషన్ల ముసుగులో దోచుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. అక్రమ వసూళ్లను అరికట్టాల్సిన బాధ్యత మార్కెట్ శాఖ అధికారులపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉల్లి ధరలు తగ్గినప్పుడు రైతులకు నష్ట పరిహారం ఇవ్వడం, ధరలు పెరిగినప్పుడు సామాన్యులు ఇబ్బందులు పడకుండా సబ్సిడీతో అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించపోగా, హెక్టారుకు రూ.50 వేలు పరిహారం చెల్లిస్తామని చెప్పినా ఇంత వరకు ఎటు వంటి కార్యాచరణ చేపట్టలేదన్నారు.

రైతుల కష్టాలు కనపడవా..?

టీడీపీ నాయకులు పొద్దస్తమానం జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడమే తప్ప రైతుల బాగోగులను పట్టించుకున్న పాపానపోలేదని కాటసాని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలోనే రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎరువుల కోసం రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో బహిరంగ మార్కెట్‌లో రసాయన ఎరువులు కొరత లేకుండా చూసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రజలు గత ప్రభుత్వంలో రైతులకు జరిగిన మేలును, ఈ ప్రభుత్వంలో జరుగుతున్న ఇబ్బందులను గమనించాలని కోరారు. హుసేనాపురం, ఎన్ కొంతలపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న నడివాగుపై వాటర్ షెడ్ అధికారుల అనాలోచితంగా నిర్మించిన చెక్ డ్యామ్ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, వాగుపై వంతెన నిర్మించాలన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్లు నాగతిరుపాలు, చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు గోపా రమణా రెడ్డి, శకునాల పుల్లారెడ్డి, హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచు చిన్న అయ్యన్న, కొమ్ము లక్ష్మన్న, కొమరోలు నాగేశులు, లొద్దిపల్లె ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలపాటి రామ కృష్ణ, బుడ్డీష్, కాల్వ సర్పంచు వెంకటేశ్వర్లు, వివిద గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

కల్లూరు: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 28వ వార్డులోని లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెంపుడు జంతువులు, పక్షులు, పశువుల నుంచి వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కుక్క, పిల్లి, ఎలుకలు, పందికొక్కులతో పాటు ఏదైన జంతువు కరచినా, గోళ్లతో రక్కినా గోరు వెచ్చని నీటిని గాయంపై పోసి సబ్బుతో శుభ్రం చేయాలన్నారు. కుక్క కాటు గాయాన్ని సబ్బుతో కనీసం ఐదు నిమిషాలు మంచినీళ్ల కొళాయి కింద కడగాలని సూచించారు. రేబిస్ ఉన్న కుక్క కరిస్తే జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి, మింగలేక పోవడం, పిచ్చిగా ప్రవర్తించడం వంటివి చేస్తారన్నారు. కుక్క కాటుకు గురైనప్పుడు అదే రోజు, మూడో రోజు, ఏడో రోజు, 14వ రోజు, 28వ రోజు భుజానికి రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. వైద్యురాలు జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

6న వేలం పాట

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సంబంధించిన అక్టోబర్ 6వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామానుజన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా 22 తేదీ నుంచి ఏడాది పాటు టెంకాయలు, టీ, మిఠాయిలు విక్రయించుకునేందుకు ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు



సి.బెళగల్ పీజీఆర్‌ఎస్‌లో సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: మండల ప్రజలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ఇచ్చే అర్జీలను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని వీఆర్వోలను, సర్వే సహాయకులను తహసీల్దార్ వెంకటలక్ష్మి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రైతులు తమ భూములపై తమకు హక్కులను కల్పించాలని, ఆక్రమణల నుంచి రక్షణ కల్పించాలని, జాయింట్ ఎల్‌పీఎంలను తొలగించాలని, భూముల కొలతలు చేపట్టాలని, భూముల ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీఆర్వోలు, సర్వే సహాయకులతో మాట్లాడుతూ.. పీజీఆర్‌ఎస్ సమస్యలపై సమగ్రంగా గ్రామాల్లో విచారించాలన్నారు. నిర్ణీత గడువులోగా భూ సమస్యలను పరిష్కరించాలని, అర్జీల అంశాలను రికార్డులలో పొందుపరచి, సమర్పితం పత్రాలను పొందాలని ఆమె రెవెన్యూ సిబ్బందికి సూచించారు. పీజీఆర్‌ఎస్‌లో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఆర్‌ఎస్‌డీటీ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం, ఆర్‌ఐ తరుస్, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ పీజీఆర్‌ఎస్ నిర్వహించగా డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉపాధిహామి ఏపీఓ రామన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీన తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే ఇంతే..!



కోడుమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ రోడ్డుపై నిలిచిన వాన నీరు



ఎమ్మిగనూరు రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు

కోడుమూరు రూరల్: చిన్న పాటి వానొస్తే చాలు పట్టణంలోని రోడ్లన్నీ మడుగులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో వాన నీరంతా రోడ్లపైనే నిలిచిపోతుంది. రోజుల తరబడి వాననీరు రోడ్లపై నిలిచిపోతుండడంతో రోడ్డంతా దెబ్బతిని గుంతలమయంగా తయారవుతోంది. రోడ్డుపై వాన నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు, దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు తమను అడిగేవారు లేరనో.. లేక మేమెందుకు చేయాలన్న నిర్లక్ష్యం వల్లనో సరిగా పట్టించుకోవడం లేదు. ఒక వేళ పట్టించుకున్న తూతూమంత్రంగా గుంతలకు ఇంత కంకర కలిపిన ఇసుకను వేసి చేతులు దులుపుకుని వెళుతున్నారేగానీ శాశ్వతంగా రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు. దీనివల్ల చిన్న పాటి వర్షం పడినా పట్టణంలోని రోడ్లన్నీ అధ్వానంగా తయారవుతున్నాయి. గుంతలు పడ్డ రోడ్లపై వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోడుమూరు వాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన గిరిష్‌బాబు భార్య, కుమార్తెతో కలిసి సోమవారం కారులో ఆర్‌జీఎం కళాశాల వద్దకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో యూటర్న్ తిరిగే క్రమంలో కర్నూలుకు వెళ్తున్న కంటైనర్ కారును ఢీకొంది. ఈ ఘటనలో గిరిష్‌బాబుకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యల లేకుండా చేశారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ ఉంటుందని ఆ పార్టీ కల్లూరు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నటేకూరులో మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడ్‌బుక్ రాజ్యాంగంలో అన్యాయానికి గురైన కార్యకర్తలకు, సామాన్యుల భరోసా కోసమే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆరాచాలు, వేధింపులకు పాల్పడిన వ్యక్తుల వివరాల పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదవుతాయన్నారు. కూటమి 15 నెలల పాలనలోనే రైతులు, ప్రజలు రోడ్లు ఎక్కి ధర్నాలు చేస్తున్నారన్నారు. ఉల్లి, టమాట, ఇతర పంటలకు సరైన ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉల్లి పంటకు హెక్టారు రూ. 50వేలు ఇస్తామని చెప్పారని, దీని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావని విమర్శించారు.

పేదలకు వైద్య విద్య దూరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆయన మంచి పేరు వస్తుందనే అక్కసుతో వాటిని ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు కల్లా వెంకట రమణారెడ్డి, కేశవరెడ్డి, ఈశ్వరయ్య, ఉలిందకొండ రమణారెడ్డి, సుంకన్న, అశోక్‌వర్ధన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, హనుమంతురెడ్డి, నారాయణ, రమణ, సర్పంచ్‌లు లక్ష్మన్న, మద్దిలేటి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాణ్యం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, ప్రజలకు డిజిటల్‌బుక్ అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం పాణ్యంలోని పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని అన్నారు. 15 నెలల్లో నేరాలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోకుండా అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా, ప్రజలకు తోడుగా ఉండేందుకు ఇటీవల డిజిటల్‌బుక్ పేరుతో క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారన్నారు. అన్యాయం జరిగినా, అధికార పార్టీ నాయకుల దాడులు ఎదురైనా, అధికారులు నిర్లక్ష్యం వహించినా ఈ డిజిటల్‌బుక్‌లో అప్లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలకు జరిగిన అన్యాయాలను ఈ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేస్తే, 2029లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయడానికి గ్రామాల వారీగా విస్తృత సమావేశాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు రామలక్ష్మయ్య, ట్రేడ్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, మాజీ సర్పంచ్ పుల్లయ్య, నాయకులు క్రిష్టారెడ్డి, బాబు, ఆటోమాబు, ఎల్లగౌడ్, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, మధుసూదన్‌రెడ్డి, ఎల్లకిట్టు, మాధవరెడ్డి, ఆశోక్‌కుమార్‌రెడ్డి, టైలర్‌బాషా, సుధాకర్, సుబ్రమణ్యం, బాబి, స్వామి, నడిపెన్న, మహేష్, షాలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అరాచకాలను నమోదు చేద్దాం

ఓర్వకల్లు: అధికార పార్టీ అరాచకాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తీసుకొచ్చిన డిజిటల్ బుక్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి అన్నారు. సోమవారం నన్నూరు గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులను లక్ష్యంగా పెట్టుకుని కూటమి నాయకులు అరాచకాలు, దాడులు, హత్యారాజకీయాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దారం రఘురామిరెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్ గఫార్, పాలకొలను రమేష్, బొగ్గుల రంగడు, మాజీ సర్పంచ్ చిన్న అయ్యన్న పాల్గొన్నారు.



నన్నూరులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడును ఆవిష్కరిస్తున్న చెన్నారెడ్డి



పాణ్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న సద్దల సూర్యనారాయణరెడ్డి

సరస్వతీ నమస్తుభ్యం



సరస్వతీ దేవిగా వల్లెలాంబదేవి



సరస్వతీ దేవిగా అంబా భవాని









సరస్వతీ దేవిగా పార్వతి, వాసవీ కన్యకా పరమేశ్వరి, నిడ్జూరులో కరెన్సీ అలంకరణలో.., ఇ.తాండ్రపాడులో..



సరస్వతీ దేవిగా వెంకాయపల్లె ఎల్లమ్మ

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాతా, శ్రీరాములమ్మ, తులజా భవాని, అంబా భవాని, వల్లెలాంబదేవి ఆలయాల్లో సరస్వతీదేవిగా దర్శనమివ్వడంతో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. అలాగే వల్లెలాంబదేవి ఆలయంలో సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి సోమవారం రాత్రి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గూడూరు మండలంలో కె.నాగలాపురంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సి.బెళగల్: స్థానిక ఈశ్వరాలయంలో కొలువైన దుర్గా మాత, పాత బస్టాండ్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలోని అమ్మవారు 8వ రోజు చదువుతల్లి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని పార్వతీ దేవిని నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమార్చనతో పాటు పంచామృతాభిషేకం నిర్వహించారని పూజారి సుదర్శనమాచార్యులు తెలిపారు.

కర్నూలు(రూరల్): దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని నిడ్జూరు, మునగాలపాడు గ్రామాల పరిధిలో తుంగభద్ర నది ఒడ్డున మామిడి తోటలో వెలసిన దుర్గమ్మ వారు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు విశేషపూజలు నిర్వహించారు. నిడ్జూరుకు చెందిన భక్తులు 1,800 కరెన్సీ నోట్లతో మాలగా చేసి దాదాపుగా రూ.3,80,000 విలువైన కరెన్సీ నోట్ల మాలను సరస్వతీ దేవికి అలంకరించారు. మూల నక్షత్రం సందర్భంగా లలిత చాలిసా, మణిద్వప వర్ణన, దేవి ఖడ్గమాల స్తోత్రములు, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సమీప 15 గ్రామాల భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో దాదాపు 2000 మంది అన్నప్రసాదం స్వీకరించారు.



సరస్వతీ దేవి అలంకరణలో సుంకులా పరమేశ్వరి



వల్లెలాంబదేవి సన్నిధిలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ఆదిమూలపు సతీష్

- దేవదాయ శాఖ అధ్వర్యంలో వెంకాయపల్లె ఎల్లమ్మను సరస్వతీ దేవి అలంకరణతో ముస్తాబు చేశారు. కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళహారతి పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.
- గార్గేయపురం బసవన్న ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ఇ.తాండ్రపాడులో సుంకులమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మకు భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.





సి.బెళగల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు, గార్గేయపురంలో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

సరస్వతీ.. నమోస్తుతే

పాణ్యం/గడివేముల: పాణ్యంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని సోమవారం సరస్వతిదేవిగా అలంకరించారు. అలాగే ఏఆర్‌కాలనీ, వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయాల్లో సరస్వతీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. గడివేముల వాసవీ మాత ఆలయంలో అమ్మవారు సరస్వతి అలంకరనలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు రూరల్: అధిక వర్షాలకు ఖరీఫ్ పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ వెంకటరమణయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఓర్వకల్లు మండలవ్యాప్తంగా పత్తి 4 వేల ఎకరాలు, ఉల్లి 1,084 ఎకరాలు, మొక్కజొన్న దాదాపు 5 వేల ఎకరాల్లో సాగు జరిగిందని తెలిపారు. అయితే ఈ నెల 26, 27 తేదీల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడులు పెరిగిపోవడం, దిగుబడులు తగ్గిపోవడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలవాలని కోరారు. మంచి దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు అధిక వర్షాలు ఆశాభంగం కలిగించాయని తెలిపారు. మండలంలో నష్టపోయిన రైతులందరికీ, నీటమునిగిన అన్ని రకాల పంటలకు తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి చంద్రబాబు నాయుడు, ముత్యు, రమణారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.